ప్రజా సమస్యల పరిష్కారానికి రోజూ అర్థ గంట

కడా పీడీ వికాస్ మరమ్మత్

ప్రజాశక్తి- కుప్పంటౌన్: కుప్పం నియోజకవర్గ పరిధిలో వివిధ శాఖలలో పనిచేస్తున్న ప్రభుత్వ అధికారులు ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రతిరోజు అర్థగంట సమయాన్ని కేటాయించాలని కడా పీడీ వికాస్ మరమ్మత్ ఆదేశించారు. సోమవారం కుప్పం పట్టణంలోని మండల అభివృద్ధి కార్యాలయ సమావేశ మందిరంలో కడా పీడీ ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేయనుకున్న నియోజకవర్గ ప్రజల నుంచి 28 అర్జీలు అందగా అందులో రెవెన్యూ శాఖకు సంబంధించి 20 అర్జీలు అందినట్లు తెలిపారు. సమయపాలన మించకుండా సమస్యలకు పరిష్కారం చూపాలని ఆదేశించారు.

అర్జీలు తీసుకుంటున్న కడా పీడీ

అటు చూడరు... బెల్టు తీయరు..

బెల్ట్ షాపులు నిర్వహిస్తే బెల్టు తీస్తామని సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్రంగా హెచ్చరించారు. కానీ నేడు ఆయన మాటలే నీటి మూటలుగా మారాయి. దుకాణదారులు యథేచ్ఛగా బెల్ట్ షాపులను ప్రోత్సహిస్తున్నారు. మందుబాబులకు మందు కొదవ లేకుండా మత్తులో తూలి తూగుతున్నారు. గొలుసు దుకాణాల పుణ్యమా అంటూ రాత్రి పగలు తేడా లేకుండా ఎక్కడ చూసినా మందు బాబులు దర్శనమిస్తున్నారు.

పుట్టగొడుగుల్లా గొలుసు దుకాణాలు

ప్రజాశక్తి- పూతలపట్టు: చిత్తూరు జిల్లాలో మంచినీరు దొరకడం కొంచెం కష్టమే కావచ్చేమో గాని మద్యం మాత్రం ఎక్కడ కావాలంటే అక్కడ విచ్చలవిడిగా లభ్యమవుతోంది. ప్రభుత్వ నిబంధనలు గాలిలో కలిపేసి మద్యం దుకాణదారులు వారి ఇష్టానుసారంగా అమ్మకాలు కొనసాగిస్తున్నారు. ఒకే వైన్‌షాప్ కింద సుమారు పది నుంచి 15 గొలుసు దుకాణాలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం వైన్ షాపులకు అనుమతి ఇచ్చిన తరువాత కొన్ని రోజులు పోలీసులు, ఎక్సైంజ్ అధికారులు హడావిడి చేసి మద్యం అమ్మకం దారులపై కేసులు పెట్టారు. ప్రస్తుతం వారి వైపు కన్నెత్తి చూడడం లేదు. దీంతో జిల్లాలో యథేచ్ఛగా మద్యం విక్రయాలకు అడ్డు అదుపు లేకుండా పోయింది. పర్మిట్ దుకాణాల అనుమతి లేకపోయినా మద్యం దుకాణం పక్కనే అదనంగా మరో గది నిర్మించి విక్రయిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రాత్రి పగలు తేడా లేకుండా మద్యం అందుబాటులో ఉండడంతో మద్యానికి బానిసైన వారు కుటుంబాలను గుల్ల చేసుకుంటున్నారు.

నిబంధనం అమలులో నిర్లక్ష్యం..

మద్యం గొలుసు దుకాణాలు నిర్వహిస్తే కఠినచర్యలు తీసుకునేలా ప్రభుత్వం నిబంధనలు పెట్టింది. మద్యం ఏ దుకాణంలో దొరికిందో తెలుసుకొని ఆ దుకాణదారుడికి రూ.5 లక్షల జరిమానా విధిస్తారు. ఇలా రెండు మూడుసార్లు దొరికితే షాప్ సీజ్ చేయాలని నిబంధనలు ఉన్నాయి. ఎక్సైజ్ శాఖ దాడుల్లో గొలుసు దుకాణాల్లో భారీ మద్యం దొరికినా నాలుగైదు క్వార్టర్ల మద్యం చూపించి నామమాత్రపు కేసులు పెడుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎందుకంటే అంతకంటే ఎక్కువ మద్యం స్వాధీనం చేసుకుంటే దుకాణ యాజమాన్యానికి రూ.5లక్షల జరిమానా విధించాల్సి ఉంటుంది. దీంతో ఈ దాడులు తూతుమంత్రంగానే జరుగుతున్నాయన్న ఆరోపణలు బలంగా వినిపిస్తోంది.

దాడుల జాడేది..

గొలుసు దుకాణాలపై జిల్లాలో పెద్దగా ఎక్కడ దాడులు జరిగిన సంఘటనలు కనిపించడం లేదు. దీంతో గొలుసు దుకాణదారులు రెచ్చిపోయి యథేచ్ఛగా మద్యం విక్రయాలు కొనసాగిస్తున్నారు. ఎక్సైంజ్ అధికారులతో పాటు స్థానిక పోలీసులు సైతం దాడులు నిర్వహించే అధికారం ఉన్న అందరూ పట్టిపట్టినట్టు వ్యవహరిస్తున్నారు. అధికార పార్టీ నాయకులకు సంబంధించిన మద్యం దుకాణాలే అధికంగా ఉండడం ఇందుకు ప్రధాన కారణమని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ప్రశాంత వాతావరణంలో పరీక్షలు : ఎస్పీ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: సోమవారం నుంచి ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు మొదలైన సందర్భంగా చిత్తూరు జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు పిసిఆర్ కాలేజీ పరీక్షా కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పరీక్షా హాల్‌లు, విద్యార్థులకు అందుబాటులో ఉన్న సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లు, పర్యవేక్షణ విధానం తదితర అంశాలను ఎస్పీ పరిశీలించారు. పరీక్షా కేంద్రంలో విధులు నిర్వర్తిస్తున్న అధికారులతో మాట్లాడి, పరీక్షల నిర్వహణలో అనుసరిస్తున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయడానికి అవసరమైన అన్ని రకాల భద్రతా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచనలు ఇచ్చారు. పరీక్షల సమయంలో అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సిసి కెమెరాల రూమ్‌ను పరిశీలించి తగిన సూచనలు చేశారు. ఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు తమ భవిష్యత్తును మెరుగుపరచుకునేందుకు పరీక్షలు చాలా కీలకమని, వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంత వాతావరణాన్ని కల్పించడం మన బాధ్యత అన్నారు. జిల్లా పోలీస్‌శాఖ విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ పరీక్షల సమయాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. ఒకటవ పట్టణ ఇన్స్పెక్టర్ జయరామయ్య, కాలేజి సిబ్బంది పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా ఎస్పీ

వినతుల వెల్లువ

పిజిఆర్ఎస్‌కు 206 అర్జీలు : కలెక్టర్

ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

అలసత్వం చేయకండి: ఎస్పీ

సోమవారం జరిగిన ప్రజాఫిర్యాదుల పరిష్కారం కార్యక్రమంలో 46 ఫిర్యాదులను స్వీకరించినట్లు జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు తెలిపారు. వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, నిర్దేశించిన గడువులోగా ఫిర్యాదుదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను ఎస్పీ ఆదేశించారు. ప్రజలు తమ సమస్యలపై న్యాయం పొందేలా నిబద్ధతతో పనిచేయాలన్నారు. ప్రతి ఫిర్యాదును సమగ్రంగా పరిశీలించి, త్వరితగతిన విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేయడమే లక్ష్యం అని ఎస్పీ అన్నారు. మొత్తం 46 ఫిర్యాదులు అందగా చీటింగ్ 3, కుటుంబ తగాదాలు 6, ఇంటి తగాదాలు 4, భర్త వేధింపులు 8, భూ తగాదాలు 12, డబ్బు తగాదాలు 6, చిన్నపాటి గొడవలు 3, దారి సమస్యలు 2, ఆస్తి తగాదాలు 2 ఉన్నాయి.

సమస్యలపై అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా ఎస్పీ

వేగంగా వినతుల పరిష్కారం

ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి అందే వినతులను వేగంగా పరిష్కరించాలని కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. పలు వినతులపై అక్కడికక్కడే సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నారు. ప్రజల నుంచి అందిన ఫిర్యాదులపై వేగంగా క్షేత్రస్థాయి విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ప్రణాళిక విభాగం 4, ఇంజనీరింగ్ 2, పింఛన్లు 2 మొత్తం ఎనిమిది వినతులు అందాయి. సహాయ కమిషనర్ ఎ.ప్రసాద్, ఎంహెచ్ఓ డాక్టర్ లోకేష్, ఎంఈ వెంకటరామి రెడ్డి ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న నగర కమిషనర్

ప్రతి అర్జీ త్వరితగతిన పరిష్కరించాలి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధపెట్టి బాధ్యతతో పని చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ వివిధ శాఖల జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజాసమస్యల పరిష్కారవేదికలో భాగంగా జిల్లా సచివాలయంలోని గ్రీవెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ, డిఆర్ఓ మోహన్ కుమార్, చిత్తూరు ఆర్‌డిఓ శ్రీనివాసులు, డిప్యూటీ కలెక్టర్లు అనుపమ, విజయలక్ష్మి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి అధికారులు పనిచేయాలని, ప్రతీ అర్జీకి అర్థవంతమైన సమాధానం ఇస్తూ పరిష్కరించాలని ప్రతీ అర్జీని ఆడిటింగ్ చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రజల నుండి అందే ప్రతి అర్జీని త్వరితగతిన పరిష్కరించాలని, అర్జీల పరిష్కారంలో క్షేత్రస్థాయిలో అధికారులు సిబ్బందితో సమన్వయం చేసుకుని అర్థవంతమైన సమాధానాలు ఇవ్వాలన్నారు. ప్రజాసమస్యల పరిష్కారవేదికలో అందిన అర్జీల పరిష్కార ప్రగతిని ప్రతివారం సమీక్షించడం జరుగుతుందని, అర్జీలు రీ-ఓపెన్ అయినట్లైతే వాటికి గల కారణాలను వివరించాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మొత్తంగా 206 అర్జీలు రాగా శాఖల వారీగా వివరాలు ఇలా ఉన్నాయి. రెవెన్యూ శాఖకు సంబంధించి 154, పోలీస్ శాఖ 5, డిపిఓ 5, డీఈవో 5, డిఆర్‌డిఏ 22, వ్యవసాయశాఖ 2, డిసిహెచ్ఎస్ 1, ఎండాన్మెంట్ 2, డిస్టిక్ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ 1, రూరల్ వాటర్ సప్లై 1, ఆర్ అండ్ బి 1, ఇరిగేషన్ 1, ఎంపీడీవో ఎస్ఆర్ పురం 1, గృహనిర్మాణ సంస్థ 5 అర్జీలు అందాయి.

రెవెన్యూ సదస్సులలో వచ్చిన

సమస్యలు పరిష్కరించండి: కలెక్టర్

అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: రెవెన్యూ సదస్సులలో ప్రజలు అందజేసిన సమస్యల అర్జీలతో పాటుగా పిజిఆర్ఎస్‌లో వచ్చిన సమస్యల ఆర్జీలను క్యాలిటితో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశం నుంచి జిల్లా జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, అసిస్టెంట్ కలెక్టర్ హిమ వంశీలతో కలసి రెవెన్యూ సదస్సులు, పిజిఆర్ఎస్‌లో వచ్చిన అర్జీల పరిష్కారం, వెబ్ ల్యాండ్ పెండింగ్ ఫైల్స్‌పై ఆర్డీఓలు, మండల తహశీల్దార్లు, డిప్యూటీ తహశీల్దార్లు, డిప్యూటీ ఇన్స్పెక్ట్ ర్లు, మండల సర్వేయర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 2024 డిసెంబర్ నుండి 2025 జనవరి 8వ తేదీ వరకు జిల్లాలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో భూములకు సంబంధించి వచ్చిన అర్జీలను, పిజిఆర్ఎస్‌లో వచ్చిన సమస్యల అర్జీలను పెండింగ్ లేకుండా ఈ నెల 15 లోపు పరిష్కారం చేయాలని తహశీల్దార్లను ఆదేశించారు. తహశీల్దార్లు ప్రతి అర్జీని పరిశీలించి ఎండార్స్మెంట్లను ఇవ్వాలన్నారు. సంబంధిత ఆర్డీఓలు వారి పరిధిలోని మండలాలలో పర్యటించి ఎండార్స్మెంట్లను పరిశీలించాలని ఆర్డీఓలను ఆదేశించారు. రీ ఓపెన్‌కి అవకాశం లేకుండా అర్జీదారులు సంతృప్తి చెందేలా సమస్యలు పరిష్కారం చేయాలని, ఫైల్ పెండింగ్స్ లేకుండా చూడాలన్నారు. డిప్యూటీ సర్వే ఆఫ్ ఇన్స్పెక్టర్లు వెబ్ ల్యాండ్‌కు సంబంధించి వంద శాతం నెలలో పూర్తి చేసేలా ఆర్డీఓలు వారికి ఆర్డర్స్ ఇవ్వాలన్నారు. రీసర్వేకి సంబంధించి జిల్లాలో 31 మండలాల్లో సర్వే జరుగుతుందని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్డీఓలు, తహశీల్దార్లు, డిప్యూటీ సర్వే ఆఫ్ ఇన్స్పెక్టర్స్, డిప్యూటీ తహశీల్దార్లు, మండల, గ్రామసర్వేయర్లు పాల్గొన్నారు.

ఆశ కార్మికుల సమస్యలపై 6న మహా ధర్నా

డిఎం అండ్ హెచ్ఓకి సిఐటియు వినతి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఆశా కార్మికుల సమస్యలను పరిష్కరించాలని విజయవాడలో 6న జరిగే మహాధర్నాకు జిల్లాలోని ఆశాలందరూ పాల్గొని జయప్రదం చేయాలని సోమవారం సమస్యలపై డిఎం అండ్ హెచ్ఓకి సిఐటియు ఆధ్వర్యంలో వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా కార్యదర్శి గంగా, సిఐటియు నాయకులు సురేంద్రన్, వాడ గంగరాజులు మాట్లాడుతూ గతంలో ఆశాలకు కనీస వేతనాలు ఇస్తామని, పని భారం తగ్గిస్తామని ఇచ్చిన హామీలు అమలు కాలేదన్నారు. అలాగే పాత వారికి అందరికీ ఫోర్ జి సిమ్ములు ఇవ్వాలని, జనాభా ఎక్కువ ఉన్న ప్రాంతాల్లో అదనంగా ఆశాను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే జిల్లాలో ఆశాలకు అదనపు పనులన్నీ పెట్టడం సరైంది కాదని విధివిధానాలు వెంటనే సర్కులర్ జారీ చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ధర్నా సందర్భంగా ఆషాలను మభ్యపెట్టే పనిచేయకుండా అన్ని సమస్యల కోసం వెంటనే జీవోలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జీవోలు విడుదల కోసం 6న విజయవాడలో జరిగే మహా ధర్నాకు జిల్లాలో ఉన్న ఆశ అందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

-వినతి పత్రం అందిస్తున్న యూనియన్ జిల్లా కార్యదర్శి గంగాదేవి

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి : ఎంపీ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు పేర్కొన్నారు. సోమవారం స్థానిక సంతపేట ఆర్ఆర్ గార్డెన్‌లో యూనియన్ బ్యాంక్ ఎంఎస్ఎం ఈ మెగా ఔట్ రీచ్ కార్యక్రమానికి ఎంపి, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, యూనియన్ బ్యాంక్ ఎండి, సీఈఓ మణి మేఖలై హాజరయ్యారు. ఎంపి మాట్లాడుతూ జిల్లా అభివృద్ధిలో భాగంగా ఎంఎస్ఎం ఈ ఔట్ రీచ్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 1000 అప్లికేషన్లు రావడం జరిగిందని, ఎంఎస్ఎంఈకి సంబంధించి జిల్లాలో బ్యాంకుల ద్వారా రుణాలు తక్కువగా అందుతున్నాయని దీనికి కారణం వారికి సివిల్ స్కోర్ లేకపోవడమేనని అన్నారు. సిబిల్ స్కోర్ తనిఖీ లేకుండా లబ్ధిదారులకు రుణాలు ఇచ్చే విధంగా చర్యలు చేపట్టాలని ఎండి, సీఈఓని, ఎల్‌డిఎంలను కోరారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పాడి పరిశ్రమ, ఉద్యాన శాఖల ద్వారా ఎక్కువ ఆదాయం లభిస్తుందని ఈ రంగాలలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు పెట్టుబడులు పెట్టి ఆదాయ వనరుగా మార్చుకునేందుకు ఎక్కువ అవకాశాలు ఉన్నాయన్నారు. గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలకు ఈ రంగాలలో వ్యాపార నిర్వహణకు అవసరమైన ఆలోచనలు ఉన్నప్పటికీ బ్యాంకుల ద్వారా రుణాలు పొందేందుకు సిబిల్ కోడ్ ద్వారా ఇబ్బందులు పడుతున్నారని ఈ అంశంపై బ్యాంకులు ఆలోచించి వారి ఆదాయ మార్గాలను పెంచేందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలన్నారు. యూనియన్ బ్యాంక్ ఎండి, సీఈవో మాట్లాడుతూ చిన్న, మధ్య తరహా వ్యాపారాలను ప్రోత్సహించేందుకు ఎంఎస్ఎంఈ ఔట్ రీచ్ క్యాంపెయిన్ ద్వారా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు రుణాల మంజూరులో ముందున్నామన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ముద్రా రుణాలు, లక్ పత్ దీదీ, బ్యాంకు లింకేజి రుణాలు సంబంధించి మెగా చెక్కులను ఎంపి, కలెక్టర్ లబ్ధిదారులకు అందజేశారు. యూనియన్ బ్యాంక్ జనరల్ మేనేజర్ భాస్కర్ రావు, అధికారులు, పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ

అంగన్వాడీలకు వేతనాలు పెంచాలి

మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలి. 10న జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలి సిఐటియు- ఎఐటియుసి -ఐఎఫ్టియుల ఆధ్వర్యంలో పీడీకి వినతి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: అంగన్వాడీల సమస్యల పరిష్కారం కోసం 42రోజులు పాటు చారిత్రాత్మక సమ్మె నిర్వహించడం జరిగిందని ఈ సందర్భంగా ప్రస్తుత ప్రభుత్వంలో ఉన్నవారు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మేము అధికారం కొస్తే సమస్యలను పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చి పది నెలలు అవుతున్న ఇప్పటివరకు పరిష్కారం కాకపోవడంతో మార్చి 10న విజయవాడలో మహా ధర్నా నిర్వహిస్తున్నట్లు సిఐటియు- ఎఐటియుసి -ఐఎఫ్టియుల ఆధ్వర్యంలో సోమవారం ఐసిడిఎస్ పీడీకి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. నాయకులు షకీలా, లలిత, ప్రేమ, జ్యోతి, సిఐటియు నాయకులు సురేంద్రన్, వాడ గంగరాజులు మాట్లాడుతూ ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో దేశంలోని శ్రామిక మహిళలను మరొకసారి మోసం చేసిందన్నారు. ప్రధానంగా స్కీం వర్కర్లకు ఆహార భద్రతకు బడ్జెట్ కేటాయింపులు తగ్గించడం దారుణమన్నారు. ఐసిడిఎస్ ఏర్పడి 50 సంవత్సరాలు పూర్తవుతున్నదని అంగన్వాడీలకు కేంద్ర ప్రభుత్వం 2014 నుండి వేతనాల పెంచలేదని, 2022లో సుప్రీంకోర్టు అంగన్వాడీలకు గ్రాట్యూటీ అమలు చేయాలని తీర్పు కూడా అమలు కాలేదని విమర్శించారు. మన రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలో ఉన్న ప్రజాప్రతినిధులు మంత్రులు ముఖ్యమంత్రితో సహా గతంలో సమ్మె చేసిన సందర్భంగా శిబిరాలను సందర్శించి అంగన్వాడీల సమస్యను పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారని, వాటిలో ఒక్క హామీ కూడా అమలు కాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్వాడీలకు కనీస వేతనం 26,000 ఇవ్వాలని, గ్రాట్యూటీ అమలు చేయాలని, రాష్ట్రంలో ఉన్న మొత్తం మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్పు చేస్తూ వెంటనే జీవో విడుదల చేయాలని, హెల్పర్ల ప్రమోషన్లకు నిర్దిష్టమైన రూల్స్ రూపొందించి అమలు చేయాలని, రాజకీయ జోక్యం అరికట్టాలని, అంగన్వాడీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. పై సమస్యలు పరిష్కారం కోసం 10న జరిగే మహాధర్నాలో జిల్లాలోని అంగన్వాడీలందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ఐసిడిఎస్ పీడీకి వినతిపత్రం అందిస్తున్న సిఐటియు నాయకులు

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి: యుటిఎఫ్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

పదోన్నతుల కోసం, టీచర్ల సీనియారిటీ జాబితాలు సిద్ధం చేస్తున్న నేపథ్యంలో స్పెషల్ ఎడ్యుకేషన్ ప్రత్యేక ప్రతిభావంతుల జాబితాను కూడా విడుదల చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) చిత్తూరు జిల్లాశాఖ డీఈఓకు విజ్ఞప్తి చేసింది. సోమవారం చిత్తూరు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవీ రమణ, జిల్లా శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం.సోమశేఖర్ నాయుడు, ఎన్.మణిగండన్‌లు వినతిపత్రాన్ని డీఈవో బి.వరలక్ష్మికి అందజేశారు. వారు మాట్లాడుతూ స్కూల్ అసిస్టెంట్ స్పెషల్ ఎడ్యుకేషన్ సబ్జెక్టుకు అర్హత గల సెకండరీ గ్రేడ్ టీచర్లు జిల్లాలో ఉన్నారని వారికి సంబంధించిన సీనియారిటీ జాబితాను కూడా విడుదల చేయాలని కోరారు. వివిధ సబ్జెక్టులలో ప్రత్యేక ప్రతిభావంతులకు పదోన్నతుల కోసం కేటాయించిన పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని, డీఎస్సీ 2002 ద్వారా లాంగ్వేజ్ పండిట్ హిందీలుగా ఎంపిక కాబడి 19 మంది 2005, 2006లలో నియామకం పొందిన వారికి డీఎస్సీ 2002 వారితో సమానంగా నోషనల్ సీనియారిటీని కోర్టు ఉత్తర్వులను అనుసరించి కల్పించాలని కోరారు. 2023 స్పాట్ వాల్యుయేషన్ రెమ్యునరేషన్ బకాయిలు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయి, వాటిని చెల్లింపులు చేయాలని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు కె.రెడ్డప్ప నాయుడు, రెహనా బేగం, రాష్ట్ర కౌన్సిలర్ ఎస్పీ బాషా, డి.ఏకాంబరం ఎం.పార్థసారథి, కె.గణేష్ కుమార్, కె.వంశీకృష్ణ, కె.మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డీఈవోకి వినతిపత్రం అందిస్తున్న యుటిఎఫ్ నాయకులు

భవిత స్కూలు పిల్లలను పరిశీలిస్తున్న అధికారులు

భవిత స్కూలు పరిశీలన

ప్రజాశక్తి -తవణంపల్లి: భవిత స్కూలును, ఆ స్కూలు పిల్లలను, రిసోర్స్ టీచర్లను ఐఈ కోఆర్డినేటర్ జయప్రకాష్ నాయుడు, తవణం పల్లె ఎంఈఓ త్యాగ రాజుల రెడ్డి సోమవారం క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఐఈఆర్‌టీ ఎస్ నాగభూషణం, ఐఆర్టీలు దేవేంద్ర, దిలీప్‌లు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

సూరి మృతదేహానికి నివాళులర్పిస్తున్న టిడిపి నేతలు

ప్రజాశక్తి - గంగాధర నెల్లూరు: మండలంలోని కట్ట కిందపల్లి దళితవాడకు చెందిన విద్యార్థి సూరి(13) విద్యుత్ షాక్‌తో ఆదివారం మృతి చెందిన విషయం తెలిసిందే.. ఆ విషయం తెలుసుకున్న టిడిపి నేతలు జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి కృష్ణమ నాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు స్వామిదాస్, జిల్లా యాదవ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్ యాదవ్, జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి దేవ సుందరం, నియోజకవర్గ టిడిపి మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి నియాజ్ అలీ, విద్యార్థి సూరి మృతదేహానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. టిడిపి నాయకులు కోదండ రెడ్డి, బాబునాయుడు, సగి, ప్రకాష్, కుటుంబ సభ్యులను పరామ ర్శించారు. ఎల్లిరి భానోదయ స్కూలు కరస్పాండెంట్ నాగేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు లావణ్య, పలువురు టీచర్లు నివాళు లర్పించారు.

మాట్లాడుతున్న టిడిపి నాయకులు

లిక్కర్ స్కామ్‌లో ఇరుక్కోవడం ఖాయం: టిడిపి

ప్రజాశక్తి - కార్వేటినగరం: గత వైసిపి ప్రభుత్వంలో చోటుచేసుకున్న లిక్కర్ స్కాంలో మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి ఇరుక్కోవడం ఖాయమని మండల టిడిపి అధ్యక్షులు చెంగల్రాయ్ యాదవ్, జిల్లా తెలుగు యువత కార్యదర్శి బీగాల రమేష్ పేర్కొన్నారు. సోమవారం కార్వేటినగరంలో వారు విలేకరులతో మాట్లాడుతూ ఎక్సైజ్ శాఖలో అవినీతి జరగడం వల్లే ఆయన ఇతర దేశాలకు వెళ్లి దక్కున్నారని ఆరోపించారు. తప్పు చేసిన వారు చట్టం చేతుల్లో తప్పించుకోలేరని, డిప్యూటీ సీఎంగా అయిదు సంవత్సరాలు ఉన్న సమయంలో గంగాధర నెల్లూరు నియోజక వర్గంలో ఏ దళితవాడనైనా అభివృద్ధి చేసిన పాపాన పోయాడా? అని ప్రశ్నించారు. సీఎం చంద్రబాబు ని వక్రీకరించి అవాస్తవాలు మాట్లాడితే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన ఎనిమిది నెలలకే ఎమ్మెల్యే డాక్టర్ థామస్ ముఖ్యమంత్రి చంద్రబాబును దళిత వాడకి తీసుకువచ్చి అభివృద్ధి పనులు ప్రారంభించారన్నారు. ఈ సమావేశంలో కృష్ణాపురం ప్రాజెక్ట్ ఛైర్మన్ అన్నామలై, టిడిపి నాయకులు పవన్ కుమార్, హేమంత్ కుమార్ రెడ్డి, రవి రాజు, జయ చంద్ర, అయ్యప్ప మండడి, చంద్రయ్య యాదవ్‌పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి: తహశీల్దారు

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మండలంలోని రైతులు, గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దారు లోకనాథ పిళ్లై పేర్కొన్నారు. సోమవారం తహశీల్దారు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో మొత్తం 9 అర్జీలుఅందాయి. అందులో 8 సమస్యలు పట్టాదారు పాసుపుస్తకం ఆన్లైన్ సంబంధించి 1 భాగ పరిష్కారం కోరుతూ అర్జీలు వచ్చాయి. అందులో ఐదు సమస్యలు అక్కడే పరిష్కరించగా మిగిలిన సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేసిన దాత

విద్యాసామగ్రి పంపిణీ

ప్రజాశక్తి - రొంపిచర్ల: పులిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్థానిక హెచ్ పి పెట్రోల్ బంక్ యజమాని, సాఫ్ట్ వేర్ ఇంజనీర్ గా హైదరాబాద్ లో స్థిరపడిన కొత్తపల్లికి చెందిన దిలీప్ సోమవారం పదవ తరగతి విద్యార్థులు 56 మందికి ఒక్కొక్కరికి 200 రూపాయలు విలువచేసే విద్యా సామగ్రిని పబ్లిక్ పరీక్షల దృష్ట్యా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దిలీప్ మాట్లాడుతూ విద్యార్థులందరూ 100 శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. విద్యార్థులు మంచి మార్కులతో చదువుకున్న పాఠశాలకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పులిచెర్ల మండల తహశీల్దారు జయసింహ, విద్యాశాఖ అధికారులు సి సిద్ధరామయ్య, పి తాతయ్య, పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుని పి రేవతి పాల్గొన్నారు.

మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న టిడిపి నాయకులు

టిడిపి నేతల సంతాపం

ప్రజాశక్తి -రామకుప్పం: మండలంలోని ముద్దనపల్లి పంచాయతీ ఆవులకుప్పం గ్రామంలో ఓగు మునిరత్నం భార్య పుష్పలత సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. టీడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి డాక్టర్ సురేష్ బాబు, నాయకులు ఆమె మృత దేహానికి పూల మాలలు. వేసి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నేత మునిస్వామి , మండల అధ్యక్షులు ఆనంద్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి నరసింహులు, నేతలు కన్నన్, సుబ్రహ్మణ్యం, త్యాగరాజు, వెంకటాచలం, రఘు ,మురళి, నాగరాజు, బాలాజీ పాల్గొన్నారు.

పైరు సాగక.. అధికారుల సలహాలు అందక..

• పశువులకు మేతగా వరి పైరు • రైతు కళ్లలో కన్నీరు

ప్రజాశక్తి -వెదురుకుప్పం: మండలానికి చెందిన ఓ రైతు వరి పైరు నాటాడు. సకాలంలో పైరు దిగుబడికి వాడాల్సిన పంట మందులు, ఎరువుల వివరాలు తెలియక అధికారుల కోసం నిరీక్షించాడు. చివరకు అధికారుల నుండి ఎలాంటి సూచనలు, సలహాలు అందక పోవడంతో చివరికి వరి పంటను వదిలిపెట్టాడు. ఎంతో కష్టించి నాటిన వరి పైరు ప్రస్తుతం పశువులకు గ్రాసంగా మారింది.. దీంతో రైతుల ఆశలు అడియాశలయ్యాయి. ఇప్పుడు కళ్ల ఎదుటే పైరు ఎండిపోతుండడంతో ఆ రైతు కళ్లలో కన్నీటి సుడులు తిరుగుతున్నాయి. తానేమి చేయాలో తెలియక నిస్సహాయత వ్యక్తం చేస్తున్న రైతు దీన స్థితి ఇది...

వెదురుకుప్పం మండలం, మాంబేడు పంచాయతీ, చిన్నమ్మ రెడ్డి కండ్రిగ పట్టుబాల కృష్ణారెడ్డి రైతు జనవరిలో సుమారు అర్ధఎకరంలో వరి నాటాడు. అప్పుడు పైరు ఎలా వుందో ఇప్పుడు కూడా అలాగే వుంది. పైరు ముందుకు సాగలేదు. పంట దిగుబడికి ఎలాంటి మందులు, ఎరువులు వాడాలో తెలియక అయోమయంలో పడ్డాడు. వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనల కోసం వేయి కళ్లతో ఎదురు చూశాడు. చివరికి ఎవరూ రాకపోవడంతో తనకు తెలిసిన, అనుభవం ఉన్నవారు చెప్పిన సలహాల ప్రకారం ఆ వరి పైరుకు తగిన మందులు, ఎరువులు ఉపయో గించాడు. చివరికి అది ఫలించలేదు. ఆశలు తలకిందులయ్యాయి. చివరికి చేసేదేమీ లేక పశువులకు మేత అయినా లభిస్తుందని వరి పైరులో కొయ్యలు నాటి పశులను కట్టేశాడు. కళ్ల ఎదుటే అవి మేతగా తింటుంటే కన్నీటి సుడులు తిరగడం ఆ రైతు వంతు అయ్యింది.

పశువులకు మేతగా మారిన రైతు కృష్ణారెడ్డికి చెందిన పైరు

బడ్జెట్లో దళితులకు అన్యాయం : కెవిపిఎస్

ప్రజాశక్తి-గంగవరం: ఇటీవల ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌లో దళితులకు తీవ్ర అన్యాయం చేశారని కెవిపిఎస్ జిల్లా నాయకులు అన్నూరు ఈశ్వర్ విమర్శించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ జనాభా ప్రకారం రూ.35వేల కోట్లు కేటాయించాల్సి ఉన్నప్పటికీ రూ.20వేల కోట్లు మాత్రమే కేటాయించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ సంక్షేమ పథకాలు 29 పథకాలు గత ప్రభుత్వం రద్దు చేసిందని, అధికారంలోకి వస్తే పథకాలన్నీ అమలు చేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం ఇంత వరకు ఆ పథకాలను పునరుద్ధ రించ లేదన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా భూమి కొనుగోలు పథకం, ఎస్సీ నిరుద్యోగులకు కార్పొరేషన్ ద్వారా రుణాలు, ఆటోలు వంటి సంక్షేమ పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చారనీ వాటి ఊసెత్తలేదన్నారు. ఎస్సీ కార్పొరేషన్ 29 పథకాలు అమలు చేయాలని, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు 35 వేల కోట్లు కేటాయించి ఎస్సీ, ఎస్టీ వార్డులు అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు.

రంజాన్ మాసంలో ఇంద్రధనస్సు

ముస్లిం సోదరుల ఆనందం



ఆకాశంలో కన్పిస్తున్న ఇంద్రధనస్సు

ప్రజాశక్తి -వెదురుకుప్పం: పగటి పూట ఆకాశంలో సూ ర్యు ని చుట్టూ ఇంద్రధనస్సు, లోపల నెలవంక రెండు ఒకే చోట కనిపించడంతో రంజాన్ మాసంలో అద్భుతమని, దీన్ని దర్శించుకున్న ప్రతి ఒక్కరూ జీవితం ధన్యమని ముస్లిం సోదరులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ సంఘటన వెదురుకుప్పం మండలం, పచ్చికాపల్లంలో ఉదయం 10 గంటల సమయంలో కనిపించింది. దీంతో ముస్లిం సోదరులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

చిత్తూరు అభివృద్ధికి నిధులు ఇవ్వండి: ఎమ్మెల్యే

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: మున్సిపాలిటీ స్థాయి నుండి కార్పొరేషన్ స్థాయికి పెరిగి పదిహేను సంవత్సరాలు గడుస్తున్నా చిత్తూరు నగరాభివృద్ధి అనుకున్నంత స్థాయిలో జరగలేదని.. చిత్తూరు నగర సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణను శాసనసభలో కోరారు. సోమవారం ప్రశ్నోత్తరాల సమయంలో భాగంగా చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లుగా వైసిపి ప్రభుత్వ పాలనలో చిత్తూరు నగరాభివృద్ధిని పట్టించుకోలేదన్నారు. మున్సిపాలిటీ నుండి కార్పొరేషన్ గా స్థాయి పెంచినా ఆ మేరకు మౌలిక వసతులు, సౌకర్యాలు పెరగలేదన్నారు. కార్యాలయంలో కార్పొరేషన్ స్థాయి ఉద్యోగుల నియామకానికి చర్యలు తీసుకోవాలన్నారు. నగరపాలక పరిధిలో వందేళ్లు దాటిన.. బ్రిటిష్ కాలంలో నిర్మించిన రెండు బ్రిడ్జిలు ఉన్నాయని.. వీటి స్థానంలో కొత్త వాటిని నిర్మించాలని కోరారు. నగరపాలక పరిధిలో నీటి సరఫరా, రోడ్లు, డ్రైనేజీ, లైటింగ్ వ్యవస్థ మెరుగుపరిచే దిశగా మంత్రిగారు ప్రత్యేక దృష్టి సారించి నిధులు మంజూరు చేయాలని కోరారు. నగర సమగ్ర అభివృద్ధి కోసం ఇప్పటికే ప్రతిపాదనలు అందించారని, నిధులు మంజూరు చేయాలన్నారు.

చికెన్ తినొచ్చు: జెసి

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: కోడి మాంసం పై వదంతులు మాని తినొచ్చని జాయింట్ కలెక్టర్ విద్యాధరి సూచించారు. బర్డ్ ఫ్లూ వదంతులు అనే వదంతులతో కోళ్ల పరిశ్రమల యజమానుల సంఘం, నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీ సంయుక్తంగా సోమవారం స్థానిక న్యూట్రిన్ ఫ్యాక్టరీ ఆవరణలో చికెన్ మేళా నిర్వహించింది. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్, నగర మేయర్ అముద, మాజీ మేయర్ కటారి హేమలత, టిడిపి రాష్ట్ర నాయకులు దొరబాబు, గురజాల చెన్నకేశవ నాయుడు పాల్గొన్నారు. బర్డ్ ఫ్లూ భయాందోళనకు గురికాకుండా తక్కువ ధరకు లభించే పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు. నెక్ చైర్మన్ శ్రీనివాసులు నాయుడు మాట్లాడుతూ 70 సెంటీగ్రేడ్ల డిగ్రీలు వేడి చేసే మాంసాన్ని తినడం వల్ల ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. బర్డ్ ఫ్లూ పక్షుల నుండి పక్షులకు వ్యాపిస్తుందని మనుషులకు వ్యాపించదని తెలిపారు. ప్రభుత్వ సహకారంతో కోళ్ల పరిశ్రమల యజమానులు రైతులు చికెన్ మేళా నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నెక్ మాజీ ఛైర్మన్ రమేష్, కోళ్ల పరిశ్రమల యజమానులు రైతులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

మొగిలీశ్వర స్వామి హుండీ లెక్కింపు

ప్రజాశక్తి -బంగారుపాళ్యం : మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో మొగిలీశ్వర ఆలయన ముఖ్యమైన రథోత్సవం రోజు సందర్భంగా తాత్కాలిక హుండీ లెక్కించినట్టు ఆలయ వంశపార ధర్మకర్త విజయ్ కుమార్ ఆలయ ఇన్‌స్పెక్టర్ సుమనప్రియ తెలిపారు. సోమవారం తాత్కాలిక ఉండి లెక్కించగా 43,577 , సేవా టిక్కెట్లు వల్ల ఆదాయం రూ 72,225, అన్నదానం రశీదు ద్వారా ఆదాయం రూ .20,594 లు వచ్చాయి. మొత్తం 1,36,396 రూపాయలు హుండీ లెక్కింపు ద్వారా వచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది శరవణ, లోకనాథ్, మధు పాల్గొన్నారు.

గ్రామానికి చేరిన మృతదేహాలు

- ఒకే కుటుంబంలో ముగ్గురి మృతి
- శోకసంద్రంగా మూగనపల్లి

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: శాంతిపురం మండల పరిధిలోని మఠం గ్రామం వద్ద శనివారం జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు మృతి చెందగా, ఒకరు గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సంగతి విదితమే.. అయితే చికిత్స పొందుతున్న పవన్ (21) పరిస్థితి విషమించి ఆదివారం సాయంత్రం మృతి చెందాడు. దీంతో ఈ ప్రమాదంలో మృతుల సంఖ్య ముగ్గురికి చేరింది. కాగా పవన్ మృతదేహానికి సోమవారం పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించడంతో మూడు మృత దేహాలు స్వగ్రామం బైరెడ్డిపల్లి మండలం ఆలపల్లి పంచాయతీ పరిధిలోని మూగనపల్లి గ్రామానికి చేరుకున్నాయి. దీంతో ఆ గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మూగనపల్లికి చెందిన మునిరాజు భార్య తులసమ్మ(45) వారి కుమారులు రవితేజ(19) ఇంటర్ చదివి ప్లంబింగ్ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. పవన్(21) డిగ్రీ సెకండ్ ఇయర్ చదువుతున్నాడు. వీరందరూ కలిసి ద్విచక్ర వాహనంపై శాంతిపురం మండలం సోగడబళ్ళ, వెంకటే పల్లి గ్రామాల తులసమ్మ అక్క వద్ద కు వెళుతున్న సమయంలో ప్రమాదవశాత్తు లారీ ఢీకొంది. తులసమ్మ, రవితేజ అక్కడికక్కడే మృతి చెందిన విషయం విదితమే.. తీవ్రంగా గాయపడిన పవన్ (21) చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి 9 గంటలకు మృతి చెందాడు. సోమవారం ముగ్గురి మృతదేహాలు సొంత గ్రామం మూగనపల్లికి చేరు కోవడంతో శోక సంద్రం లో మునిగింది. కొడు కు లు చదువుకొని కుటుంబ పోషిస్తూ తమకు ఆధారంగా నిలుస్తారని తండ్రి ఎన్నో ఆశలు పెట్టుకున్నాడు. కొడుకుల చదువు కోసం అప్పులు చేసి చదివించాడు. ప్రస్తుతం కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ తరుణంలో ఇలా తన భార్య, ఇద్దరు కుమారులు మరణించడం తీవ్ర ఆవేదన ఎదుర్కొన్నాడు. పెద్ద కొడుకు బెంగళూరులో కూలి పనులు చేస్తున్నాడు. అతని సాయం కోసం ఎదురుచూస్తున్న తరుణంలో తన భార్య, ఇద్దరు కుమారులను మృత్యువు కబళించడంతో ఒక తనకు దిక్కెవ్వరని ప్రశ్నిస్తున్నాడు. తులసమ్మ, రవితేజ, పవన్ మృతదేహాలకు గ్రామస్తుల సహాయంతో ఒకే సారి అంత్యక్రియ నిర్వహించారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితుడు మునిరాజు కోరుతున్నాడు. అంత్రక్రియల్లో స్థానిక వైస్ ఎంపీపీ నారాయణస్వామి, సర్పంచ్ రమణారెడ్డి, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని బాధితుడిని పరామర్శించారు.

ముగ్గురి మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

బోరు, మోటార్ల విద్యుత్ తీగలు చోరీ

రైతుల లబోదిబో

ప్రజాశక్తి-పూతలపట్టు: వ్యవసాయ బోరు, మోటార్ల వద్ద గుర్తు తెలియని వ్యక్తులు విద్యుత్ తీగల చోరీకి పాల్పడుతున్నారు. పూతలపట్టు మండల పరిధిలోని సుమారు 12 మంది రైతులకు చెందిన విద్యుత్ బోరు మోటార్ల వద్ద తీగలు వరుసగా శని, ఆదివారం రాత్రి సమ యాల్లో చోరీకి గురయ్యాయి. అమ్మేపల్లి, సామనత్తం గ్రామ పంట పొలాల్లో ఈ ఘటన చోటు చేసుకుంది. ఉదయం పంట పొలాలకు నీరు వదలడానికి బోరు బావుల వద్దకు వెళ్లి చూసిన రైతుల గుండెలు ఆగినంతపనైంది. బోరు మోటా రు నుంచి విద్యుత్ స్తంభాల వరకు ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలు చోరీకి గురవు తున్నాయి. వరుసగా జరుగుతున్న చోరీలతో రైతులు లబోదిబోమంటున్నారు. చోరీలపై పోలీసులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఘనంగా 'మహిళా సాధికారత వారోత్సవాలు'

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం జిల్లా అంతటా విద్యార్థినులకు వ్యాస రచన పోటీలు, ఓపెన్ హౌస్, మహిళా పోలీసులకు మెడికల్ క్యాంపు నిర్వహించారు. జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలోని అన్ని పాఠశాలలో లింగ సమానత్వంపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని తమ అభిప్రాయాలను వ్యక్తపరిచారు. విజేతలకు ప్రత్యేక బహుమతులు అందజేసారు. మెడికల్ క్యాంప్‌లో మహిళా పోలీసులకు ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు విపత్కర పరిస్థితుల్లో సంఘవిద్రోహ శక్తులను ఎదుర్కోడానికి ఉపయోగించే పరికరాలను ప్రదర్శించి, వాటి వినియోగం, ప్రాముఖ్యతపై క్లుప్తంగా వివరించారు. ఈవ్ టీజింగ్, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, సైబర్ నేరాలు, మహిళలపై జరుగుతున్న నేరాలపై తీసుకోవలసిన జాగ్రత్తలను పోలీసులు వివరించారు. ఈనెల 8వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామని, ఈ తరహా కార్యక్రమాలు మహిళలకు శక్తిని, మానసిక స్థైర్యాన్ని, స్వీయరక్షణ సామర్థ్యాన్ని పెంపొందించడానికి దోహదపడతాయని జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు తెలిపారు.

ప్రజాశక్తి -శాంతిపురం : లింగ సమానత్వంతోనే దేశ పురోగతి సాధ్యమవుతుందని ఎస్ఐ వి నరేష్ పేర్కొన్నారు. ఏపీ ప్రభుత్వం నిర్వహిస్తున్న మహిళా సాధికార వారోత్సవాలు మార్చి ఒకటి నుండి ఎనిమిదవ తేదీ వరకు నిర్వహిస్తున్నట్టు రాళ్లబూదుగూరు ఎస్ఐ ఐ నరేష్ తెలిపారు. జడ్పీ ఉన్నత పాఠశాల తుమిసిలో లింగ సమానత్వ అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఒక దేశ పురోగతి ప్రభావితం చేసే అంశాల్లో లింగ సమానత్వం ముఖ్యమైందని, మానవ వనరుల్లో సగభాగమైన మహిళలకు ప్రాధాన్యత కల్పిస్తున్న దేశాలు ఆర్థికంగా ప్రగతి మార్గంలో ముందుకెళతాయన్నారు. లింగ సమానత్వం అంశంపై వ్యాసరచన పోటీలలో బాగా రాసిన విద్యార్థులు ముగ్గురికి మార్చి 8వ తేదీ రాళ్ళబూదుగూరు పోలీస్ స్టేషన్‌లో బహుమతి అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్ర మంలో పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిత్తూరులో

బంగారుపాలెం: మహిళలను గౌరవించడం మన బాధ్యత అని సీఐ శ్రీనివాసులు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో మహిళావారోత్సవాలు కార్యక్రమంలో భాగంగా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిఐ శ్రీనివాసులు మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంగా ఉన్నప్పుడే కుటుంబాల అభివృద్ధి చెందుతా యన్నారు. అనంతరం పలువురు మహిళలకు వైద్య పరీక్షలు చేసి తగిన మందులు ఇప్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విజయ కుమారి, పలువురు వైద్యులు, పోలీసులు పాల్గొన్నారు.

బంగారుపాలెంలో

సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి: తహశీల్దారు

ప్రజాశక్తి-కుప్పం టౌన్ : సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దారు చిట్టిబాబు పేర్కొన్నారు. కుప్పం మండల తహశీల్దారు చిట్టిబాబు పట్టణ పరిధిలోని 8వ వార్డు పరమసముద్రం ప్రాంతంలో పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, ముఖ్యంగా వెనుకబడిన తరగతులకు చెందిన దళితుల అభ్యున్నతికి ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. వీటిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, సంక్షేమ పథకాలను పేద దళిత సభ్యులు సద్వినియోగం చేసుకొని, ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు ప్రతాప్ సింహ, మురుగేష్, మాజీ సర్పంచ్ శివశంకర్, రెవెన్యూ శాఖ, పోలీసు శాఖ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

'మాలల సింహగర్జన'ను జయప్రదం చేయండి

రాయలసీమ జేఏసీ అధ్యక్షులు సుదర్శన్

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: రాయలసీమ మాలల సింహ గర్జన సభను జయప్రదం చేయాలని రాయలసీమ మాలల సింహగర్జన అధ్యక్షులు సుదర్శన్ పేర్కొన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు వర్గీకరణ పేరుతో మాల, మాదిగలకు చిచ్చు పెట్టారని దీనివల్ల రెండు కులాలు వారు నష్టపో తారని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగంలోని ఆర్టికల్ 341 విరుద్ధమని ఇది ప్రధాని మోడీ ప్రభావిత తీర్పు కానీ రాజ్యాంగ పరంగా ఇచ్చిన తీర్పు కాదన్నారు. 2004లో సుప్రీంకోర్టు ఐదు గురు న్యాయమూర్తులతో ఎస్సీ వర్గీకరణ అధికారం రాష్ట్రాలకు లేదని చేయాలంటే పార్లమెంటులోనే 341 అధికరణను సవరించాలని తెలిపారన్నారు. ఈ తీర్పు ను పంజాబ్, హర్యానా, తమిళ నాడు లో వర్గీకరణ కొట్టి వేశారని ఈ తీర్పు అంట రానితనం ఆధారంగా ఇచ్చార ని, కానీ ఆర్థిక పరంగా కాదన్నారు. ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లను బిజెపి ప్రభుత్వం ఎత్తివేసే కుట్రకు పాల్పడుతోందని ఈనెల 23న తిరుపతిలో నిర్వహించే సభకు 'హలో మాల..చలో తిరుపతి'ని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ ఉపాధ్యక్షులు ధన శేఖర్, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, సహాయ కార్యదర్శి చంద్రయ్య, రెడ్డప్ప, నవీన్ దేవా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాలల సింహ గర్జన నాయకులు

క్రైం న్యూస్

ఇసుక లారీని సీజ్ చేసిన దృశ్యం

ఇసుక లారీ సీజ్

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: అక్రమంగా తరలిస్తున్న ఇసుక లారీని చిత్తూరు తాలూకా పోలీసులు సీజ్ చేశారు. తిరుపతి నుండి వస్తున్న 14 టైర్ల లారీని చిత్తూరు బైపాస్ మురకంబట్టు వద్ద తాలూకా పోలీసులు ఆపి చెక్ చేసేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో లారీ డ్రైవర్ పారిపోయేందుకు ప్రయత్నించాడు. లారీ డ్రైవర్లు పట్టుకొని విచారించగా తిరుపతి జిల్లా చింతవరం సముద్రం ఒడ్డు నుండి ఇసుకను చెన్నైకి తరలిస్తున్నట్లు విచారణలో తెలిసింది. ఈ మేరకు తాలూకా పోలీసులు లారీ డ్రైవర్ వంశీకృష్ణ లారీ ఓనర్ మహేష్ రెడ్డిలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రైలు పట్టాలపై మృతదేహం

ప్రజాశక్తి- కుప్పం రూరల్: కుప్పం మండలం మల్లానూరు సమీపంలోని రైల్వే పట్టాల పై వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్లు స్థానికులు తెలిపారు. వెంటనే సమాచారాన్ని కుప్పం రైల్వే పోలీసులకు అందించారు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ప్రాథమిక విచారణ చేపట్టి, కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. పోలీసుల కథనం మేరకు మృతుడు తమిళనాడు నాట్రంపల్లి ప్రాంతానికి చెందిన సెల్వం చిన్న గౌండర్ గా గుర్తించామన్నారు. మృతుని మరణానికి గల కారణాలు పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది.

సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

సేంద్రియ పంటలు ఆరోగ్యకరం

ప్రజాశక్తి - కార్వేటినగరం: సేంద్రియ ఎరువులతో సాగు చేసిన పంటలు ప్రజలకు ఆరోగ్యకరమైనవని మండల విద్యాశాఖ అదికారి విజయకుమార్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణంలో సేంద్రియ ఎరువులతో సాగు చేసిన కూరగాయల స్టాల్‌ను ఏర్పాటు చేశారు. స్టాల్‌ను సందర్శిమచిన ఎంఈవో మాట్లాడుతూ రసాయన ఎరువులతో సాగు చేసిన కాయకూరలను ఆహారంగా తీసుకోవడం ద్వారా ప్రజలు అంతుపట్టని రోగాలతో బాధపడుతున్నారని అన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా సేంద్రియ ఎరువులతో సాగు చేసిన పంటలను ఆహారంగా తీసుకోవడం ఆరోగ్యానికి శ్రేయస్సు కరమన్నారు. ఉపాధ్యాయులు. అంగన్వాడీ వర్కర్లు తమ పాఠశాలల ఆవరణంలో సేంద్రియ ఎరువులతో కూడిన కూరగాయలు సాగు చేసి మధ్యాహ్నం భోజనంలో పోషకాలతో కూడిన భోజనాన్ని అందించాలని సూచించారు. ప్రతి పాఠశాల ఆవరణంలోను ఇలాంటి పంటలను సాగు చేయడానికి ఉపాధ్యాయులు అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో 2 మనోజ్ కుమార్, ఎంఐఎస్ కోఆర్డినేటర్ రేఖ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎద్దుల పోటీలు చట్టరీత్యా నేరం: డిఎస్‌పి

ప్రజాశక్తి-కుప్పం టౌన్ : జల్లికట్టు, ఎద్దుల పండగ, మైలారు పండుగ పేరుతో ఎద్దుల పోటీలు నిర్వహించడం చట్టరీత్యా నేరమని కుప్పం డి.ఎస్.పి పార్థసారథి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కుప్పం సబ్ డివిజన్ పరిధిలోని కుప్పం పట్టణం, కుప్పం, గుడుపల్లి, శాంతిపురం, రామకుప్పం మండలాల పరిధిలో ఎద్దుల పోటీలను నిషేధిస్తున్నట్టు తెలిపారు. చట్ట వ్యతిరేకంగా కుప్పం సబ్ డివిజన్ పరిధిలో ఎక్కడైనా ఎద్దుల పోటీలు నిర్వహిస్తే, అట్టి వారిపై జంతు సంరక్షన చట్ట ప్రకారం శిక్షార్హులు అవుతారని తెలిపారు. చట్ట వ్యతిరేకంగా ఎద్దుల పోటీలు నిర్వహించిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

శోభాయమానంగా పుష్ప పల్లకి

ప్రజాశక్తి- బంగారుపాల్యం: మొగిలేశ్వర స్వామి పుష్పపల్లకి అత్యంత వైభవంగా శోభయోమానంగా జరిగింది. సోమవారం మండలంలోని మొగిలి గ్రామంలో శ్రీకామాక్షి సమేత మొగిలిశ్వర స్వామి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం 9వ రోజు పుష్పపల్లికిపై మొగిలిశ్వరస్వామి భక్తులకు దర్శనం గావించారు. ఉభయదారులుగా బొమ్మయపల్లి గ్రామానికి చెందిన మమత ఈశ్వర్ నాయుడు కుటుంబ సభ్యులు వ్యవహరించారు. వంశపార ధర్మకర్త విజయ్ కుమార్, కార్యనిర్వాహణాధికారి మునిరాజులు అర్చకులు పాల్గొన్నారు.

'సునీల్ కుమార్ సస్పెన్షన్ విరుద్ధం '

ప్రజాశక్తి- పుంగనూరు : సీనియర్ ఐపిఎస్ అధికారి సునీల్ కుమార్‌ను ప్రభుత్వం సస్పెండ్ చేయడం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి ఎన్ఆర్.అశోక్ అన్నారు. అనుమతి లేకుండా సునీల్ కుమార్ విదేశాలకు వెళ్లారనే కారణంగా ఆయనను సస్పెండ్ చేస్తున్నట్టు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడాన్ని సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన తీవ్రంగా ఖండించారు. పీవీ సునీల్ కుమార్ పూర్తిగా తన సొంత ఖర్చులతో అమెరికాలో ఉంటున్న కుమారుడిని చూడటానికి వెళ్లారని విదేశాలకు వెళ్లే హక్కు పూర్తి వ్యక్తిగత స్వేచ్ఛ అని అన్నారు. భారత అత్యున్నత న్యాయస్థానం ఐపిఎస్ అధికారి సతీష్ చంద్రవర్మ కేసులో ఇదే విషయాన్ని పునరుద్ఘాటించిందని, సుప్రీంకోర్టు సూచనలను కూడా పాటించకుండా సునీల్ కుమార్‌ను సస్పెండ్ చేయడం ప్రభుత్వ కుట్రగానే భావించాల్సి ఉంటుందన్నారు. నిబంధనల ప్రకారం నోటీసు జారీచేసి ఆయన వివరణ కోరాలని, ఆయన ఇచ్చే వివరణ సంతృప్తికరంగా లేకపోతే అప్పుడు తదుపరి చర్యలు తీసుకోవాలని అన్నారు. కానీ కూటమి ప్రభుత్వం ఈ నిబంధనలను ఏమాత్రం పట్టించుకోలేదని తప్పుపట్టారు. ప్రభుత్వం కనీసం నోటీసు జారీ చేయకుండా ఏకపక్షంగా సస్పెండ్ చేయడం సరైనది కాదు.

నిరాశ్రయులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: నగరంలోని మెప్మా, నగరపాలక సంస్థ సహకారంతో సపోర్ట్ సంస్థ నిర్వహిస్తున్న నిరాశ్రయుల వసతి గృహంలోని 60 ఏళ్ల పైబడిన వృద్ధులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా సపోర్ట్ సంస్థ అధ్యక్షులు వసతి గృహ నిర్వాహకులు జోసెఫ్ రాజు మాట్లాడుతూ వృద్ధాప్య పెన్షన్ అర్హులైన నిరాశ్రయులకు పింఛన్ల అందజేయటం అభినందనీయమని అన్నారు. ఈ పెన్షన్ వారి ఆర్థిక అవసరాలకు ఎంతో ఉపయోగపడుతుందని సంతోషం వ్యక్తం చేశారు.

పది పబ్లిక్ పరీక్షల హాల్ టికెట్లు విడుదల

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: 2025 ఎస్ఎస్‌సి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు సంబంధించిన హాల్ టికెట్లు సోమవారం మధ్యాహ్నం నుండి పాఠశాల ప్రధానోపాధ్యాయుల లాగిన్‌లో అందుబాటులో ఉన్నాయని జిల్లా విద్యాశాఖ అధికారిని వరలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఎస్‌సి పబ్లిక్ పరీక్షల, మార్చి-2025 హాల్ టిక్కెట్లను వాట్సాప్ - మన మిత్ర ద్వారా విద్యార్థులు నేరుగా డౌన్లోడ్ చేసుకునేలా తొలిసారిగా ప్రక్రియ ప్రారంభించామన్నారు.